ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

బుధవారం 17 ఏప్రిల్ 2024




నవమి వేడుకలకు ముస్తాబైన ఆలయాలు 8లో

హమాలీలు లేక.. కొనుగోళ్లు సాగక..! 8లో

పడిపోతున్న భూగర్భ జలాలు

- పట్టణాల్లో కానరాని ఇంకుడు గుంతలు
- రోజు రోజుకూ పెరుగుతున్న నీటి వినియోగం
- మున్సిపాలిటీల్లో అమలు కాని నిబంధనలు





జగిత్యాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో నీటి వనరులపై అధికారులు దృష్టి సారించడం లేదు. ప్రతీ ఇంట్లో బోరు తవ్వడంతో భూగర్భ జలాల వినియోగం ఎక్కువ అవుతోంది. వృథా నీటిని భూమిలోకి ఇంకించే చర్యలు చేపట్టని కారణంగా భూగర్భ జలాలు యేటా తగ్గుతున్నాయి. పట్టణాల్లో జనాభా పెరిగిపోవడంతో రోజురోజుకూ విస్తరిస్తున్నాయి. శివారు ప్రాంతాలు నివాస కేంద్రాలు మారుతున్నాయి. ప్రతీ సంవత్సరం వందల సంఖ్యలో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇంటి నిర్మాణ స మయంలో ఇంకుడు గుంత నిర్మించాలన్న నిబంధన ఉన్నా... జగిత్యాల మున్సిపాలిటీతో పాటు కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ తదితర పట్టణాల్లో ఎక్కడా అమలు కావడం లేదు.

ఇంకుడు గుంతల నిర్మాణం పేరిట రూ. లక్షలు మూలుగుతున్నా పట్టించుకోవడం లేదు. వీటి నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో ఇంటి యజమానులు వీటిని నిర్మించేందుకు ముందుకు రావడం లేదు. పట్టణాల్లో రోజురోజుకూ నీటి వినియోగం ఎక్కువ కావడంతో భవిష్యత్‌లో ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. ప్రభుత్వం జల విధానం ముసాయిదాల్లో పట్టణాల్లో నీటి సంరక్షణకు ఇంకుడు గుంతల నిర్మాణాలు తప్పని సరి చేసినా అధికారులు కొత్తగా నిర్మించే ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతల నిర్మాణాలు జరిగేలా చూస్తే భూగర్భ జలాలు పెరిగి భవిష్యత్తులో నీటి ఇబ్బందులు ఉండవు.



మున్సిపల్ అధికారుల ఉదాసీనత...

పట్టణాల్లో ఇంటి నిర్మాణ అనుమతి సమయంలో ఇంకుడు గుంత నిర్మాణానికి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు అదనంగా ఆర్‌డబ్ల్యూ హెచ్‌ఎస్ కింద ప్రతి చదరపు మీటరుకు రూ. 15 చొప్పున డిపాజిట్లు తీసుకుంటారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ఎంత లేదన్నా స్థల విస్తీర్ణం ప్రకారం కనీసం రూ. 2 వేల వరకు డిపాజిట్ల పేరిట వసూలు చేస్తున్నారు. అనుమతి తీసుకున్న గృహ నిర్మాణదారు ఇంట్లో ఇంకుడు గంత నిర్మిస్తే వాటిని మున్సిపల్ అధికారులు పరిశీలించి తిరిగి ఆ డిపాజిట్ డబ్బులను సదరు నిర్మాణదారునకు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ పట్టణాల్లో కొత్తగా ఇల్లు నిర్మించే దాంట్లో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టడం లేదు. 2023 సంవత్సరంలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపాలిటీల్లో సుమారు 350 ఇళ్ల నిర్మాణాలకు సుమారు రూ. 7 లక్షల వరకు డిపాజిట్ పేరిట వసూలు అయినట్లు సంబంధిత వర్గాలు అంటున్నాయి.

ప్రయోజనాలివీ...

ఇంకుడు గుంతలు నిర్మించడం వల్ల భూగర్భజల మట్టం పెరుగుతుంది. చేతి పంపుల్లోనూ నీటి లభ్యత కనిపిస్తుంది. ఎండి పోయిన చేతి పంపులు, బావుల్లో మళ్లీ నీరు వస్తుంది. భవిష్యత్‌లో నీటి ఇబ్బం దులు ఉండవు. పట్టణాల్లో నూతనంగా భవన నిర్మాణాల్లో ఇంకుడు గుంతలు ఉండేలా చూడాలి. అధికారులు నిరంతర పర్యవేక్షణ చేస్తే భవిష్యత్‌లో నీటి ఇబ్బందులు ఉండవు. ఇంకుడు గుంతల ఆవశ్యకత, భవిష్యత్తులో జరిగే నీటి ఎద్దడిపై స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తలతో పట్టణాల్లో విస్తృత ప్రచారం చేయించాల్సిన అవసరముంది. ప్రధాన కూడళ్లలో, కాలనీల్లో ఇంకుడు గుంతల వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది.

ఆ డబ్బులు మున్సిపాలిటీ ఖాతాల్లో మూలుగుతూనే ఉన్నాయి. డబ్బులు వసూలు చేస్తున్న అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం వల్లనే ఇంటి నిర్మాణాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలు కానరావడం లేదన్న విమర్శలున్నాయి. అంతే కాకుండా జిల్లా వ్యాప్తంగా అంతటా సిమెంట్ నిర్మాణాలు భారీగా పెరిగిపోయాయి. ప్రధాన రహదారులతో పాటు ప్రతీ కాలనీలో కూడా సిమెంట్ రోడ్లు వేశారు. కాలనీల్లోని ప్రజ లు కూడా తమ భవనాలు ముందు సిమెంట్ చేయించుకుం టున్నారు. దీంతో భారీ వర్షాలు కురిసి నా నీరు దిగువకే వెళ్తుంది కానీ భూమిలోకి ఇంకే పరిస్థితి లేకుండా పోతోంది. దీంతో భూగర్భ జలాలు తగ్గిపోయి బోర్లు సైతం ఎండిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

కాలనీల్లో కొనసాగుతున్న సర్వే...

జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో ప్రతి భవనం, అపార్ట్‌మెంట్, ఫం క్షన్ హాల్స్, ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, విద్యా సంస్థలు, వాణి జ్య సముదాయాల్లో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు తీయించాలని ప్రభుత్వం మున్సిపల్ అధికారులను ఇటీవల ఆదేశించింది. వారం రోజుల్లోగా ఇంకుడు గుంతల సర్వే పూర్తి చేయాలని పేర్కొంది. దీంతో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపాలిటీల్లో ఇంకుడు గుంతల వివరాలను మున్సిపల్ సిబ్బంది సేకరించి రాష్ట్ర ప్రభుత్వానికి పం పించనున్నారు. వార్డుల్లోని కాలనీల్లో పర్యటిస్తూ 350 గజాలు దాటిన భవనాలు, పంక్షన్ హాల్స్ ఇతర వాటిల్లో ఇంకుడు గుంతలను పరిశీలించి యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఇంకుడు గుంతలు లేని భవనాల యజమానులకు నోటీస్‌లు జారీచేస్తున్నారు. ఇంకుడు గుంత తప్పనిసరిగా తీయించుకోవాలని ఆయా భవనాల యజమానులకు చెబుతున్నారు.

సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

జగిత్యాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో జగిత్యాల, నిజామాబాద్ జిల్లాలకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం హైద్రాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి పలువురు నాయకులకు కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నిజామాబాద్, ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలకు చెందిన పలువురు నేతలు కాంగ్రెస్‌లో చేరారు. కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాల్, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్ రావులతో పాటు జిల్లాలోని కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన పలువురు నేతలు కాంగ్రెస్‌లో చేరారు. నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

●గల్ఫ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి మంగళవారం జగిత్యాలకు చెందిన టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ షేక్ చాంద్‌పాషా హైద్రాబాద్‌లో వినతిపత్రం సమర్పించారు. వివిధ కారాణాల వల్ల స్వదేశానికి తిరిగిన వచ్చిన కార్మికులకు పునరావాసం కల్పించాలని కోరారు.

ఎమ్మెల్సీ మహేశ్ గౌడ్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు

జగిత్యాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గల్ఫ్‌లో జరిగిన ప్రవాస భారతీయుల సమ్మేళనానికి హాజరై మంగళవారం హైద్రాబాద్ చేరుకున్న టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్‌ను నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు కలిశారు. హైద్రాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కోరుట్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ్‌రావు, ధర్మపురి దేవస్థాన అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ జువ్వాడి కృష్ణారావు, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి శేర్ నర్సారెడ్డి, ఇతరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే మెరుగైన వైద్య సేవలు

జగిత్యాల టౌన్, మార్చి 16: బీఆర్ఎస్ హయాంలోనే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించిన ఘనత పార్టీ చీఫ్ కేసీఆర్‌కే దక్కుంతుందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల రూరల్ మండలం అనంతారం గ్రామానికి చెందిన తుపాకుల చంద్రపతి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. సమస్యను గ్రామ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకరాగా తక్షణమే స్పందించారు. నిమ్స్‌లో శస్త్ర చికిత్సకు అవసరమయ్యే రూ. 1.50 లక్షల ఎల్‌వోసీ పత్రాన్ని బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. నాయకులు శ్రీనివాస్, సురేందర్, శ్రీపాల్, నాగరాజు, శ్రీకాంత్ ఉన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలలపై అవగాహన సదస్సు

రాయికల్, ఏప్రిల్ 16: రాయికల్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంపై అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. అధికారులు ఉపాధ్యాయులు, మెప్మా సిబ్బంది, వీవో సంఘాల అధ్యక్షులకు అమ్మ ఆదర్శ పాఠశాల విధి విధానాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో చిరంజీవి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ ఉన్నారు.

ఆరబెట్టిన ధాన్యాన్నే కేంద్రాలకు తీసుకురావాలి

కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా



కొనుగోలు కేంద్రాన్ని తనిఖీచేస్తున్న కలెక్టర్

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 16 : రైతులు కొనుగోలు కేంద్రాల్లోకి తీసుకు వచ్చే ధాన్యాన్ని ఆరబెట్టుకొని తీసుకురావాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలంలోని తాటిపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కొనుగోలు చేస్తామన్నారు. రైతులకు సమస్యలు వచ్చినపుడు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 18004258187కు ఫోన్‌చేసి సమస్యలను సమాచారం అందిస్తే సమస్యను పరిష్కరిస్తామన్నారు. రైతులు వేసవికాలంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వడదెబ్బతగలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రైతుల కు కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులతో పాటు, నీడ, తాగునీరు, ఓఆర్ ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. టోల్ ఫ్రీ నెంబర్‌లు తెలిసే విధంగా బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి అధికారి సంపత్‌రావు, పౌరస రఫరాల జిల్లా మేనేజర్ హతీరాం, జగిత్యాలరూరల్ తహసీల్దార్ రాంమోహన్, ఐకేపీ ఏపీఎం గంగాధర్, సిబ్బంది, పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

- అడిషనల్ కలెక్టర్ దివాకర
- చిన్న హనుమాన్ జయంత్యుత్సవాలపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

మల్యాల, ఏప్రిల్ 16: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో ఈ నెల 22 నుంచి 24 వరకు జరిగే చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని అడిషనల్ కలెక్టర్ దివాకర సూచించారు. చిన్న జయంతి ఏర్పాట్లపై మంగళవారం వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటికి అధిక ప్రాధాన్యం ఇస్తూ భక్తులు వచ్చే దారుల్లో విరివిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఏడు చోట్ల పార్కింగ్‌తో పాటు లైటింగ్‌కు చర్యలు తీసుకోవాలని సూచించారు. మాలవిరమణ మూడు చోట్ల, స్నానాలకు 125 షవర్లు, ప్రస్తుతం ఉన్న సీసీ కెమెరాలకు అదనంగా మరో 50 చోట్ల అదనంగా ఏర్పాటు, వైద్య సేవలు అందించడానికి 6 చోట్ల వైద్య శిభిరాలు, 2 అంబులెన్స్‌లు, 2 ఫైర్ ఇం జన్లు అందుబాటులో ఉంటాయని ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ తెలిపారు. 380 మందిచే నిరంతర పారిశుధ్యం చేపట్టడం జరుగుతుందని, పోలీస్ కంట్రోల్ రూం, మీడియా సెంటర్ల ఏర్పాటు చేయాలని సంబందిత అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనులు జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో జగిత్యాల ఆర్డీవో పి.మధుసూధన్, డీఎస్పీ రఘు చందర్, ఆలయ ఈవో చంద్రశేఖర్, డీపీవో దేవరాజ్, డీఎంహెచ్‌వో శ్రీధర్, అటవీ అధికారి వెంకటేశ్వర్లు మల్యాల, కొడిమ్యాల మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు పలు శాఖలు అధికారులు పాల్గొన్నారు.

శ్రీ రామ నవమికి ఇల్లంతకుంటకు

ధర్మపురి నుంచి తలంబ్రాలు, పట్టు వస్త్రాలు

ధర్మపురి, ఏప్రిల్ 16: శ్రీ రామ నవమి పురస్కరించుకుని ఇల్లంతకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయానికి మంగళవారం ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం నుంచి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు తీసుక వెళ్లారు. ఆలయంలో ఈ నెల 17న జరిగే శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణోత్సవానికి ఆలయ అర్చకులు వెంట రాగా సామవేద పండితులు ముత్యాలశర్మ, ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ ఇల్లంతకుంట ఆలయానికి వెళ్లారు. అనంతరం ఇల్లంతకుంట ఈవో సుధాకర్, ఆలయ అర్చకులకు వారందరు ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు అందించారు. ఈ సందర్భంగా వారందరిని ఇల్లంతకుంట ఆలయం పక్షాన స్వామి శేష వస్త్రం కప్పి, ప్రసాదాలు, చిత్రపటం బహూకరించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, జూనియర్ అసిస్టెంట్ వావిలాల తిరుపతి పాల్గొన్నారు.



పట్టు వస్త్రాలు, తలంబ్రాలు తీసుక వెళుతున్న ఆలయ ఉద్యోగులు

పాఠశాల కమిటీలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్



పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న అధికారులు

జగిత్యాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నూతనంగా ఏర్పాటు చేసిన అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల విధి విధానాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను ఇచ్చారు. మంగళవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల ఆడిటోరియంలో జగిత్యాల రూరల్ మండల ప్రత్యేకాధికారి బోనగిరి నరేశ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటు, కమిటీల బాధ్యతలు, చేపట్టే పనుల వివరాల గురించి వివరించారు. పాఠశాలల్లో మొదటి ప్రాధాన్యత గల పనులను గుర్తించి కమిటీల అనుమతితో తీర్మానం చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ అనుమతితో పనులు చేపట్టాలని సూచించారు. కమిటీ తీర్మానం మేరకు త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి చేయాల్సిన అవసరముందన్నారు.. ఈ కార్యక్రమంలో జగిత్యాల అర్బన్ మండల ప్రత్యేకాధికారి రాజుకుమార్, మున్సిపల్ కమిషనర్ అనిల్ బాబు, మెప్మా ఏవో శ్రీనివాస్, మెప్మా డీఎంసీ సునీత, టీఎంసీ రజిత, సీవో రాధ, ఎంపీవో రవిబాబు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీలకు ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలి

నిజామాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజి రెడ్డి గోవర్ధన్



మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

బీర్‌పూర్, ఏప్రిల్ 16: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు ఓట్లతో గుణపాఠం చెప్పాలని బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. మంగళవారం బీర్‌పూర్ మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి గోవర్ధన్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జడ్పీచైర్మన్ దావ వసంత బీర్‌పూర్ శ్రీలక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సమావేశంలో బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో దొంగలకు, మోసం చేసి గెలిచిన వారికి ఓట్లతో సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ కంటే డబుల్ పథకాలు ఇస్తామని ప్రజలను నమ్మించి మోసం చేసిన వ్యక్తి రేవంత్‌రెడ్డి అన్నారు. ఎంపీ అర్వింద్ ప్రజలకు మొఖం చూపే పరిస్థితి లేదన్నారు. అనంతరం ఎమ్మె ల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పా లనలో చేసిన అభివృద్ధి సంక్షేమం ప్రజలకు వివరించి బీఆర్ఎస్ అభ్యర్థిని గెలి పించాలని కోరారు. జడ్పీచైర్‌పర్సన్ వసంత మాట్లాడుతూ కులం మతం పేరుతో రాజకీయాలు చేయడం బీజేపీ వంతని అబద్దాలను కూడా సిగ్గుపడేలా అర్వింద్ మాట్లాడుతాడని గుర్తు చేశారు. మండల అభివృద్ధి బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే మండలం అభివృద్ధి చెందిందన్నారు. బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచంధర్‌రావ్, మండల పార్టీ అధ్యక్షులు నారపాక రమేష్, మాజీ ఎంపీపీ కొల్మాల రమణ, యూత్ అధ్యక్షులు రమచంద్రంగౌడ్, మాజీ సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

ధర్మారం,ఏప్రిల్16: ధర్మారం మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన మిట్ట మహిపాల్(45) అనే వ్యక్తి మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గమనించి కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. మృతుడి భార్య మల్లవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య

మల్లాపూర్, ఏప్రిల్, 16: మండలంలోని మొగిలిపేట గ్రామానికి చెందిన మామిడి నర్సయ్య(34) అనే రైతు జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మామిడి నర్సయ్య అనే రైతు మద్యానికి బానిసై అనారోగ్యంతో బాధపడుతున్నాడు. జబ్బు నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంటి రేకుల షెడ్డులోని దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు నర్సయ్య భార్య వనిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహనీయుల అడుగుజాడల్లో నడవాలి

● ఎస్‌యూ వీసీ ఆచార్య మల్లేశ్

గణేశ్‌నగర్, ఏప్రిల్16: ప్రతి ఒక్కరూ మహనీయుల అడుగుజాడల్లో నడవాలని శాతవాహన విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య మల్లేష్ అన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయంలో 2024 మహనీయుల జయంత్యుత్సవాలను (మహాత్మాజ్యోతిరావుపూలే, సావిత్రిబాయ్ పూలే, బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్, కొమరం భీమ్, చాకలి ఐలమ్మ) ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సమాజంలోని అసమానతలను నిర్మూలించాలని పిలుపునిచ్చారు. రిజిస్ట్రార్ ఆచార్య వరప్రసాద్ మాట్లాడుతూ దేశమంతా మహనీయుల సేవలను గుర్తించుకోవాలన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆచార్య అడప సత్యనారాయణ మాట్లాడుతూ అత్యంత ప్రభావశీలి, దార్శనికుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని అన్నారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయం ఆచార్య గోన నాయక్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకు సమాన అవకాశాలు ఇవ్వడమే ధ్యేయంగా పూలే దంపతులు జీవించారన్నారు. ఎస్సీ ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ కే పద్మావతి మాట్లాడుతూ అంబేద్కర్ అందించిన రిజర్వేషన్లతో అందరికీ సమాన అవకాశాలు వచ్చాయన్నారు. జాతీయ సేవా పథకం సమన్వయ అధికారి డాక్టర్ మనోహర్ మాట్లాడుతూ మహనీయులంతా దేశ ప్రగతి కోసం, సామాజిక న్యాయం కోసం కలిసికట్టుగా ముందుకు సాగాలని అన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎం సరసిజ, ఆర్ట్స్, సైన్స్ కామర్స్ కళాశాలల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ కే తిరుపతి, డి విజయ ప్రకాష్, డి.విజయ్ కుమార్, ప్రిన్సిపాల్స్ అధ్యాపకులు పాల్గొన్నారు.

టిప్పర్లకు జరిమానా

మల్యాల, ఏప్రిల్ 16: అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లకు రెవెన్యూ అధికారులు ఒక్కో టిప్పరుకు రూ.5వేల చొప్పున జరిమానా విధించారు. సోమవారం మండలంలోని బల్వంతాపూర్‌లో గల రేగుల చెరువు నుంచి అక్రమంగా నల్లమట్టి తవ్వకాలు చేపట్టారనే దానిపై భారతపు శేఖర్‌తో పాటు ఎనిమిది టిప్పర్ల యజమానులు, డ్రైవర్లపైన పోలీసులు సుమోటో కేసు నమోదు చేసి టిప్పర్లను రెవెన్యూ అధికారులకు అప్పగించారు. దీంతో తహసీల్దార్ టిప్పర్లకు జరిమానా విధించారు.

● ఇద్దరిపై కేసు..

మల్యాల మండలంలోని రాంపూర్ శివారులో వరదకాలువ మట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్, ఎక్స్‌కావేటర్ యజమానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. టిప్పర్ డ్రైవర్ బంగారపు రమేష్, మట్టి తీస్తున్న ఎక్స్‌కావేటర్ యజమాని గంగాధర్‌పై ఇరిగేషన్ ఏఈఈ అరుణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు.

● టిప్పర్ డ్రైవర్‌పై కేసు..

మల్యాల మండలంలోని రాజారంలో టిప్పర్ ఢీకొని విద్యుత్ స్తంభం ధ్వంసం అయింది. టిప్పర్‌ను అజాగ్రత్తగా నడిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్ సాయి దిలీప్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హుజూరాబాద్ డిపో మేనేజర్ శ్రీకాంత్ సస్పెండ్

హుజూరాబాద్, ఏప్రిల్ 16: హుజూరాబాద్ డిపో మేనేజర్ శ్రీకాంత్‌ను సస్పెండ్ చేస్తూ మంగళవారం సాయంత్రం ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. సోమవారం ఆర్టీసీ డ్రైవర్ రవీందర్ చార్జి మెమో విషయంలో రూ. 20వేలు లంచం తీసుకుంటూ ఎల్కతుర్తిలోని ఓ హోటల్‌లో డిపో మేనేజర్ శ్రీకాంత్ ఏసీబీకి చిక్కిన విషయం విధితమే. డిప్యూటీ ఆర్ఎం సురికొంటి భూపతిరెడ్డి డీఎంపై విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక పంపించగా, సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

గంజాయి విక్రయిస్తున్న ఆరుగురి అరెస్ట్

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 16: నిషేధిత గంజాయి రవాణా, అమ్మకాలు జరుపుతున్న ఆరుగురుణ వ్యక్తులను గోదావరిఖని టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ బీ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 14న సోమవారం సంత ఆవరణలో మచ్చుపేటకు చెందిన రఘును గంజాయి తరలిస్తూ పట్టుబడ్డాడు. రఘుని అదుపులోకి తీసుకుని విచారించగా, గుంటూరుపల్లికి చెందిన శివారూట్ వద్ద గంజాయి కొనుగోలు చేసి కాలనీ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్టు తెలిపినట్టు సీఐ పేర్కొన్నారు. గుంటూరుపల్లిలో శివారూట్ కోసం వెళ్లగా అక్కడ శివ దగ్గర పనిచేసే మధు అదుపులోకి తీసుకుని వివచారించినట్టు సీఐ తెలిపారు.

మధు ఇచ్చిన సమాచారం ఆధారంగా శివారూట్ దగ్గర గంజాయి కొనుగోలు చేసిన వినోద్, శివప్రసాద్, చైతన్య, సాయి రేవంత్‌ను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 1,117 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ రవీందర్ తెలిపారు. మంగళవారం ఆరుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ బీ రవీందర్ తెలిపారు.

కష్టాలను ఎదిరించి.. లక్ష్యాన్ని సాధించి

● యూపీఎస్సీలో మెరిసిన వెలిచాల యువకుడు

● జాతీయ స్థాయిలో 27వ ర్యాంకు సాధించిన బీడీ కార్మికురాలి కుమారుడు

రామడుగు, ఏప్రిల్ 16: తండ్రి అనారోగ్యంతో మృతి చెందాడు.. తల్లి బీడీలు చేస్తూ కొడుకును పోషించింది. ఎటు చూసినా కష్టాలు.. అయినా అతడు తన లక్ష్యంపైనే దృష్టి పెట్టాడు. అనుకున్నది సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. అతడే రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన సాయికిరణ్. అతడు బీటెక్ చదువుతుండగా తండ్రి క్యాన్సర్‌తో మృతి చెందాడు. సాయికిరణ్‌కు స్రవంతి అనే ఒక సోదరి ఉంది. పిల్లలిద్దరూ చదువులో ముందుండేవారు. ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగానే ఉన్నా తల్లి లక్ష్మి ధైర్యం కోల్పోలేదు. బీడీలు చేస్తూ పిల్లలను చదివించింది. పిల్లలూ ఆమె నమ్మకాన్ని వమ్ము చేయలేదు. సాయికిరణ్ సోదరి స్రవంతి ఏఈఈగా పనిచేస్తున్నారు. సాయికిరణ్ వరంగల్ ఎన్ఐటీలో బీటెక్ పూర్తి చేసి ఓ కంపెనీలో హార్డ్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం సాధించాడు. ఆర్థికంగా కొంత వెసులుబాటు లభించిన తర్వాత తాను చిన్నప్పటి నుంచి కలలు కన్న సివిల్స్‌పై దృష్టి సారించాడు. 2021 నుంచి ఎటువంటి కోచింగ్ తీసుకోకుండా తానే సొంతగా ప్రిపేర్ అయ్యాడు. రెండో ప్రయత్నంలో లక్ష్యాన్ని చేరుకుని జాతీయ స్థాయిలో 27వర్యాంకు సాధించాడు.


తల్లి, సోదరితో సాయికిరణ్

అమ్మ అండతో చదివాను

- సాయికిరణ్, సివిల్స్ 27వ ర్యాంకర్

కష్టపడి చదివాను.. అనుకున్నది సాధించాను. ఇది నా జీవితంలో మధురమైన సందర్భం. అత్యున్నతమైన స్థానానికి చేరుకున్నందుకు సంతోషంగా ఉంది. మా అమ్మ అండగా నిలవడం వల్లే ఇది సాధ్యమైంది. కష్టాలను ఎదురించి మమల్ని చది వించిన అమ్మ ఇప్పుడు సంతోషంగా ఉంది. నాలాగే కష్టపడి చదివే ప్రతి ఒక్కరికీ సంపూర్ణ సహకారాన్ని అందిస్తాను.

● విద్యాభ్యాసం

సాయికిరణ్ రామడుగు మండలం వెలచాల గ్రామంలో సరస్వతి పాఠశాలలో ఏడో తరగతి వరకు చదువుకున్నాడు. కరీంనగర్‌లో పదో తరగతి, ఇంటర్, వరంగల్ ఎన్ఐటీలో బీటెక్ పూర్తి చేశాడు.

సంతోషంగా ఉంది

- లక్ష్మి, సాయికిరణ్ తల్లి

చాలా సంతోషంగా ఉంది. సాయికిరణ్ సివిల్స్‌లో జాతీయ స్థాయిలో 27వ ర్యాంకు సాధించడం మాకందరికీ గర్వకారణం. మా ఆయన లేకపోయినా కష్టపడి ఇద్దరు పిల్లలను చదివించాను. వారిద్దరు ప్రయోజకులయ్యారు. నా కష్టానికి తగ్గ ప్రతిఫలం లభించింది. ఒక తల్లికి ఇంతకంటే సంతోషం ఏముంటుంది.


వెలిచాలలో సాయికిరణ్ ఇల్లు

'సహన'ంతో ముందుకుసాగి..

సివిల్స్‌లో 739వ ర్యాంకు సాధించిన కరీంనగర్ యువతి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 16: యూపీఎస్సీ ఫలితాల్లో కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన సహన జాతీయస్థాయిలో 739వ ర్యాంకు సాధించి సత్తాచాటారు. జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన కొలనుపాక గీత, జయశంకర్ ప్రసాద్ (అనిల్) దంపతుల కూతురైన సహన కెన్‌క్రెస్ట్ స్కూల్‌లో ఎసెస్సీ చదివారు. శ్రీగాయత్రీ జూనియర్ కళాశాలలో ఇంటర్, హైదరాబాద్ జేఎన్టీయూలో బీటెక్ పూర్తి చేశారు. ఇంజనీరింగ్ పూర్తికాగానే క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఉద్యోగం వచ్చినప్పటికీ సివిల్స్‌పై మక్కువతో ఉద్యోగంలో చేరకుండా ఢిల్లీకి వెళ్లి కోచింగ్ తీసుకున్నారు. తొమ్మిది నెలలు కోచింగ్ తీసుకున్న సహన మూడుసార్లు సివిల్ పరీక్ష రాశారు. నాలుగో ప్రయత్నంలో జాతీయ స్థాయిలో 739వ ర్యాంకు సాధించారు. సహన తండ్రి జయశంకర్ ప్రసాద్ (అనిల్) ప్రైవేట్ కళాశాలలలో ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఒక దినపత్రికలో పాత్రికేయుడిగా పనిచేస్తున్నారు. తల్లి గీత గృహిణి. తమ కూతురు కష్టపడి చదివి నందుకు తగిన ఫలితం దక్కిందని, ఎంతో సంతోషాన్ని కలిగించిందని అన్నారు. తల్లిదండ్రుల సహకారంతో సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యానని సహన చెప్పారు. ఈ ర్యాంకుతో ఐఆర్ఎస్ వస్తుందని, జాబ్‌లో జాయిన్ అయిన తర్వాత మళ్లీ సివిల్స్ రాసి ఐఏఎస్ సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.


విజయ సంకేతం చూపుతున్న సివిల్స్ ర్యాంకర్ సహన


సహనకు స్వీట్లు తినిపిస్తున్న తల్లిదండ్రులు గీత, జయశంకర్‌ప్రసాద్ (అనిల్)

ఉపాధ్యాయుల జీతాల బిల్లుల దుర్వినియోగంపై

కొనసాగుతున్న విచారణ

తిమ్మాపూర్, ఏప్రిల్16: మండలంలోని ఎల్ఎండీ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా ఉపాధ్యాయుల జీతాల బిల్లుల దుర్వినియోగంపై విచారణ కొనసాగుతోంది. ఎల్ఎండీ స్కూల్ కాంప్లెక్స్‌లో ఉపాధ్యాయుల జీతాల బిల్లుల నిధులు సుమారు 10లక్షల రూపాయలు దుర్వినియోగం అయినట్లు ఆరోపణలు ఉన్నాయి. విచారణ అధికారిగా డైట్ ప్రిన్సిపాల్ శ్రీ రాం మొండయ్య, బెజ్జంకి, కోహెడ ఇంచార్జ్ ఎంఈవోగా విధులు నిర్వర్తిస్తున్న పావని ప్రజెంటింగ్ అధికారిగా, జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ కన్సల్టెంట్ రవీందర్‌ను టెక్నికల్ అధికారిగా జిల్లా విద్యాశాఖ అధికారి నియమించారు. ఈ నెల 15న విచారణ ప్రారంభించారు. రెండవ రోజు మంగళవారం 16న కూడా విచారణ కొనసాగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజభాను చంద్రప్రకాశ్‌తో పాటు మొత్తం 21మంది ఉపాధ్యాయులను విచారణ చేశారు. ఒకటి, రెండు రోజుల్లో నివేదికను జిల్లా విద్యాశాఖధికారికి సమర్పిస్తామని విచారణ అధికారి శ్రీరాం మొండయ్య తెలిపారు.

రాముని కల్యాణానికి పట్టువస్త్రాలు సమర్పణ

ఇల్లందకుంట, ఏప్రిల్ 16: శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో జరిగే శ్రీరామనవమిని పురస్కరించుకొని మంగళవారం ధర్మపురి, కొండగట్టు ఆలయాల కార్యనిర్వాహణాధికారులు స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశారు. కార్యక్రమంలో కొండగట్టు ఈవో చంద్రశేఖర్, ధర్మపురి ఈవో శ్రీనివాస్, ఇల్లందకుంట ఈవో కందుల సుధాకర్, అర్చకులు శేషం రామాచార్యులు, వంశీధరచార్యులు పాల్గొన్నారు.

నేడే సీతారాముల కల్యాణం

● ముస్తాబైన రాజన్న క్షేత్రం ● ఏర్పాట్లు చేసిన ఆలయ అధికారులు ● తరలివస్తున్న భక్తుల

వేములవాడ, ఏప్రిల్ 16:వేములవాడ శ్రీరాజరాజేశ్వర క్షేత్రంలో శ్రీసీతారామచంద్ర స్వామివారల దివ్య కళ్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రతి సంవత్సరం శ్రీరామ నవమి సందర్భంగా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామివారి దేవస్థానంలో భద్రాద్రిని తలపించేరీతిలో శ్రీసీతారామచంద్రస్వామివారి కల్యాణ వేడుకలను అత్యంత ఘనంగా, కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. శ్రీరామ నవమి సందర్భంగా 17వ తేదీ బుధవారం ఉదయం 11-59 గంటలకు శ్రీసీతారాముల కల్యాణోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించే విధంగా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా ఆలయం, రాజగోపురం, ఆలయ పరిసరాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. చైర్మన్ ఛాంబర్ ఎదుట విశాలమైన కల్యాణ వేదికను నిర్మించి పూలతో అందంగా అలంకరించారు. వేదిక పరిసరాల్లో కలకత్తా టెంట్లు, పందిళ్ల, షామియానాలు ఏర్పాటు చేశారు. భక్తులు కూర్చునే ప్రాంతాన్ని సెక్టార్లుగా విభజించి బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఎండవేడి తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఎయిర్ కూలర్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆలయ ముందుభాగంతో పాటు పాత ఆంధ్రాబ్యాంక్ ఏరియా, అంబేధ్కర్ విగ్రహం కూడలి మొత్తం కలకత్తా పందిళ్లు వేశారు. శ్రీసీతారాముల కళ్యాణం భక్తులందరూ వీక్షించడానికి వీలుగా పలు చోట్ల ఎల్ఈడీ టీవీలను ఏర్పాటు చేశారు. ప్రథమ చికిత్స కేంద్రాలు, వైద్య శిబిరాలు, స్పెషల్ రెస్క్యూ బృందాలు ఏర్పాటు చేశారు. అత్యవసర సేవల కోసం అంబులెన్స్, అగ్నిమాపక యంత్రం సిద్ధంగా ఉంచారు. భక్తుల కోసం మంచినీటి ప్యాకెట్లు సిద్ధంగా ఉంచారు. దాతల సహకారంతో అన్నదానంతో పాటు మజ్జిగ పంపిణీ చేయనున్నారు.


గదుల కోసం వేచి చూస్తున్న భక్తులు


విద్యుత్‌కాంతులతో రాజన్న ఆలయం

తరలివస్తున్న భక్తులు..

శ్రీసీతారాముల కళ్యాణం తిలకించడం కోసం వేలాది మంది భక్తులు రాజన్న క్షేత్రానికి తరలివస్తున్నారు. 17వ తేదీ బుధవారం ఉదయం నిర్వహించనున్న కల్యాణం ప్రత్యక్షంగా తిలకించాలన్న కోరికతో మంగళవారం రాత్రి వరకు సుమారు 70 వేల మందికి పైగా భక్తులు వేములవాడకు చేరుకున్నట్లు అంచనా. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన యాత్రికులతో ఆలయ వసతి గదులు, ప్రైవేటు అద్దె గదులు నిండిపోయాయి. గదులు అందుబాటులో లేకపోవడంతో వేలాది మంది భక్తులు బహిరంగ ప్రదేశాలలోనే బస చేయాల్సి వచ్చింది. జానకిరాముల కల్యాణం సందర్భంగా త్రిశూలం ధరించి, తలంబ్రాలు పోసుకుని శివుడిని మను వాడే ఆనవాయితీ ఉన్న వేలాది మంది శివ పార్వతులతో పాటు భారీ సంఖ్యలో హిజ్రాలు వేములవాడ చేరు కున్నారు. శ్రీరామనవమి సందర్భంగా శ్రీరాజరాజేశ్వరస్వామివారిదేవస్థానంలో బుధవారం కోడె మొక్కులు మినహా ఆర్జిత సేవలు నిలిపి వేస్తున్నట్లు ఆలయ అధికారులు ప్రకటించారు.

వివాహిత ఆత్మహత్య

తిమ్మాపూర్, ఏప్రిల్16: మండలంలోని మల్లాపూర్ గ్రామంలో ఓ వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్ మండల కేంద్రానికి చెందిన గోస్కుల సుమలత(26)కు 2017వ సంవత్సరంలో తిమ్మాపూర్ మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌తో వివాహం జరిగింది. వీరికి నాలుగు సంవత్సరాల కూతురు ఉంది. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సుమలత ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎల్ఎండి ఎస్సై చేరాలు తెలిపారు.


సుమలత(ఫైల్)

జీవితంపై విరక్తితో..

ముస్తాబాద్, ఏప్రిల్ 16: మండలంలోని గూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి జీవితంపై విరక్తి చెంది బలవన్మరణానికి పాల్పడ్డాడని ఎస్సై శేఖర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గూడెం గ్రామానికి చెందిన బొప్ప బాలయ్య(67) కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. వ్యాధి మరింత ఎక్కువ కావడంతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుని కొడుకు బొప్ప అనిల్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బావిలో దూకి వృద్ధురాలు..

ఇల్లంతకుంట, ఏప్రిల్ 16: మండలంలోని గాలిపెల్లి గ్రామానికి చెందిన సావనపెల్లి పోచవ్వ (70) అనే వృద్ధురాలు అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. పోచవ్వ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. జీవితంపై విరక్తిచెంది బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరు..

ఇల్లంతకుంట, ఏప్రిల్ 16: మండలంలోని ఎర్రనర్సుపల్లె గ్రామానికి చెందిన కంకటి స్వామి (45) క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజుగౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. స్వామి గ్రామంలో కిరాణం దుకాణం నడుపుకొని జీవిస్తున్నాడు. వ్యవసాయ భూములలో బోర్లు వేయడం వల్ల దాదాపు 23లక్షల అప్పులు అయ్యాయి. అప్పు చెల్లించడానికి తనకు ఉన్న భూమిని అమ్మడానికి ప్రయత్నించగా తమ్ముడు ప్రభాకర్ అడ్డుచెప్పాడు. ఇంటిని అమ్మి అప్పులు తీర్చుదామనుకున్నా ఇంటిపై ప్రభాకర్ రుణం తీసుకున్నాడు. ఇదే విషయంపై తమ్ముడిని ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వలేదు. దీనితో సోమవారం అర్ధరాత్రి క్రిమిసంహారక మందుతాగగా సిరిసిల్ల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. తన భర్త మృతికి ప్రభాకర్, అప్పులే కారణం అని కడుపుపై రాసుకొని చనిపోయాడని మృతుడి భార్య నాగమణి ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరి అదృశ్యం

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 16: తన భర్త ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీస్‌లు అదృశ్యం కేసు నమోదు చేశారు. పోలీస్‌లు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని రామన్నపల్లికి చెందిన కొలకాని రాజయ్య (46) ఎనిమిది రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రెండు సంవత్సరాలుగా ఆరోగ్యం బాగా ఉండటం లేదు. అప్పటి నుంచి మందులు వాడుతున్నాడు. గతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి వచ్చాడు. ఈ నెల 9న రాత్రి 8.30 గంటలకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బ్లూ కలర్ ప్యాంట్, ఎల్లో కలర్ టీషర్టు ధరించి ఉన్నాడు. రాజయ్య భార్య రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వరంగంటి రవి తెలిపారు.


రాజయ్య(ఫైల్)

స్కూల్ వ్యాన్ కింద పడి చిన్నారి దుర్మరణం

మల్యాల, ఏప్రిల్ 16: కొడుకును స్కూల్ వ్యాన్ ఎక్కించడానికి వెళ్లిన తల్లి.. తన వెనుకాలే వస్తున్న తన కూతురును గమనించక పోవడంతో అదే వ్యాన్ కింద పడి చిన్నారి దుర్మరణం చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. మల్యాల మండలం మద్దుట్ల గ్రామానికి చెందిన రజాక్, హసీనకు కొడుకు సాజీత్, కుమార్తె అరీభా(18నెలలు) ఉన్నారు. కొడుకు పక్క గ్రామంలోని సరస్వతీ విద్యానికేతన్ పాఠశాలలో చదువుకుంటున్నాడు. మంగళవారం ఉదయం స్కూల్ వ్యాన్ రావడంతో కొడుకును ఎక్కించేందుకు తల్లి హసీన వెళ్లింది. వ్యాన్ వద్దకు చిన్నారి అరీభా రావడాన్ని తల్లి గమనించలేదు. సాజీత్ ఎక్కగానే వ్యాన్ ముందుకు కదలడంతో ముందు చక్రాల కింద అరీభా పడి తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారిని చికిత్స కోసం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే చిన్నారి మృతి చెందింది. ఈ మేరకు డ్రైవర్ ఎనగందుల రవీందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు. వ్యాన్‌లో విద్యార్థులను ఎక్కించడానికి పాఠశాల సిబ్బంది లేకపోవడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు.


అరీబా (ఫైల్)

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మోదీ సర్కార్

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 16: భారత దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సర్కార్ ఖూనీ చేస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం సీపీఐ జిల్లా కార్యాలయంలో కమ్యూనిస్టు యోధుడు చంద్ర రాజేశ్వరరావు వర్ధంతి నిర్వహించారు. చంద్ర రాజేశ్వరావు చిత్రపటానికి చాడ వెంకటరెడ్డి, సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు మర్రి వెంకటస్వామి, జిల్లా నాయకులు నివాళులర్పించారు. అనంతరం విలేకరుల సమావేశంలో చాడ వెంకటరెడ్డి మాట్లాడారు. చంద్ర రాజేశ్వరరావు తన జీవితాన్ని కమ్యూనిస్టు పార్టీకి అంకితం చేశారని అన్నారు. దోపిడీ రహిత, వర్గరహిత సమాజం కోసం జీవితకాలం పనిచేశారన్నారు.


చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పెళ్లిపత్రికలు పంచడానికి వెళ్లి అనంతలోకాలకు

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 16: బంధువుల పెళ్లి పత్రికలు ఇవ్వడానికి వెళ్లి తిరిగి వస్తూ రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మంగళవారం మృతిచెందాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం లక్కెట్టిపేటకు చెందిన శ్రీకాంత్, బోరెం మహేష్ (21) తమ దూరపు బంధువుల పెళ్లి పత్రికలను పంచడానికి ద్విచక్ర వాహనంపై ఉదయం మల్యాల మండలం లంబాడిపెల్లి గ్రామానికి బయ ల్దేరారు. పత్రికలు ఇచ్చి సాయంత్రం 4.30 గంటలకు లంబాడిపెల్లి నుంచి తమ స్వగ్రామం లక్కెట్టిపేటకు బయల్దేరారు. మార్గం మధ్యలోని ధరూర్ వద్ద శ్రీకాంత్, మహేష్ ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని వెనుక వైపు నుంచి గుర్తుతెలియని వాహనం బలంగా ఢీ కొట్టింది. దీంతో వెనుకాల కూర్చున్న మహేష్‌కు తీవ్రగాయాలవడంతో జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మహేష్ మృతి చెందాడని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ధర్మపురి, ఏప్రిల్ 16: ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్‌లో శ్రీ సీతారామచంద్ర స్వామి వార్షిక, తిరు కల్యాణ బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో మూడు రోజుల పాటు ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. మొదటి రోజున ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాల మధ్య అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భజన సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు నంబి అరుణ్‌కుమార్, నేరెళ్ల వంశీకృష్ణ, విజయ్‌కుమార్, కిరణ్‌కుమార్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ రాజగోపాల్‌శర్మ, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, మాజీ ధర్మకర్త సాయిని శ్రీనివాస్, వావిలాల ప్రకాష్, నలుమాసు వైకుంఠం పాల్గొన్నారు.

బీజేపీని భారీ మెజార్టీతో గెలిపించాలి

రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి ప్రవీణ్

జగిత్యాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి ప్రవీణ్ కోరారు. మంగళవారం పట్టణంలోని 37వ వార్డులో ఇంటింటికీ బీజేపీ పేరిట ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. నిజామాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. నరేంద్రమోదీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల కల్లబొల్లి కబుర్లు నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో జగిత్యాల పట్టణ బీజేపీ అధ్యక్షుడు రంగు గోపాల్, ప్రధాన కార్యదర్శి ఆముదరాజు, మ్యాకల లక్ష్మీ, పవన్, రాజేందర్, మల్లీశ్వరీ, పద్మ, మమత, లక్ష్మీ, భానుప్రియ, మధురిమ, కవిత పాల్గొన్నారు.

పెగడపల్లి: కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో అమలు చేస్తున్న పథకాలను చూసి తిరిగి భారతీయ జనతాపార్టీకి దేశ ప్రజలం దరు పట్టం కట్టాలని చూస్తున్నారని ఆ పార్టీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చింతకింది అనసూర్య అన్నారు. మంగళవారం మండలంలోని బతికెపల్లిలో ఆ పార్టీ మండల నాయకులతో కలసి ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గంగుల కొమురెల్లి, నాయకులు కిషోర్, మల్లేష్, రవీందర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని సిరికొండలో మంగళవారం బీజేపీ నాయకులు కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌ను రెండోసారి గెలిపించాలని కోరుతూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. దేశంలో నరేంద్రమోదీ, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో బండి సంజయ్‌కుమార్ చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాయి, అనిల్‌రెడ్డి ఉన్నారు.

మెట్‌పల్లి మున్సిపల్ అధికారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మెట్‌పల్లి, ఏప్రిల్, 16 : మున్సిపల్ కార్యాలయ పనులు చేసిన బిల్లులు ఇవ్వమంటే బెదిరింపులకు పాల్పడుతున్న ఇన్‌చార్జి శానిటర్ ఇన్స్‌పెక్టర్ రత్నాకర్‌పై మంగళవారం టెంట్ యూనియన్ అధ్యక్షుడు కోటగిరి అరుణ్‌గౌడ్ కలెక్టర్, మెట్‌పల్లి ఆర్డీవో, మున్సిపల్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఇన్‌చార్జి శానిటర్ ఇన్స్‌పెక్టర్ గుర్రం రత్నాకర్ ఆదేశాల మేరకు తాను గత ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమానికి టెంట్లు, కుర్చీలు సప్లై చేశానన్నారు. అందుకు అయిన రూ. 42 వేలు బిల్లు ఇవ్వమంటే సంవత్సర కాలం నుంచి ఆఫీస్ చుట్టూ తిప్పుకుంటున్నాడన్నారు. తన పిల్లల ఫీజు కట్టాలని, ఈ నెల 13న బిల్లు ఇవ్వమని ఫోన్ ద్వారా బతిమిలాడినా తన వద్ద రూపాయి కూడా లేదని బెదిరింపులకు పాల్పడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని వాపోయాడు. తనకు న్యాయం చేయాలని కలెక్టర్, మెట్‌పల్లి ఆర్డీవో, మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

ఎన్‌హెచ్‌ఎం జిల్లా అధ్యక్షురాలు మధురిమ

జగిత్యాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాల్సిన అవసరముందని ఎన్‌హెచ్‌ఎం జిల్లా అధ్యక్షురాలు మధురిమ అన్నారు. మగళవారం పట్టణంలోని సుభాష్‌నగర్ కార్మిక భవన్‌లో నిర్వహించిన ఎన్‌హెచ్‌ఎం ఆల్ క్యాడర్స్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులందరినీ ప్రభుత్వం వెంటనే పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, హెల్త్ కార్డులు, వేతనాల పెంపు, ఏడు నెలల పీఆర్‌సీ ఏరియర్స్ వెంటనే విడుదల చేయాలన్నారు. కాగా సమావేశానికి ముందుగా జరిగిన ఎన్నికల్లో జిల్లా ఎన్‌హెచ్‌ఎం అధ్యక్షురాలిగా మధురిమ, ప్రధాన కార్యదర్శిగా రజిత, వైస్ ప్రసిడెంట్లుగా అనురాధ, బడుగ శిరీష, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వడ్నాల చందులు ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సమావేశంలో రాజన్న సిరిసిల్ల జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి కాడారి రాములు, రాజేశ్ ఖన్నా, వెన్న మహేశ్, రాణి పాల్గొన్నారు.

ప్రాధాన్యం కలిగిన పనులకు నిధులు ఉపయోగించాలి

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 16 : పాఠశాలకు వచ్చిన నిధులతో ప్రాధాన్యత కలిగిన పనులకు ఉపయోగించాలని ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని అమ్మా ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులైన మహిళా సంఘాలు, ప్రధానోపాధ్యాయులకు మండల పరిషత్ సమావేశం మందిరంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో తాగు నీరు, మరుగుదొడ్లు, విద్యుత్, తరగతి గదుల మర మ్మతులను చేపట్టాలన్నారు. ప్రతి తరగతిలోని ముగ్గురు విద్యార్థులకు సంబంధించిన తల్లిదండ్రులతో కమిటీ ఏర్పాటు చేయాలని, వారితో అభివృద్ధి పనులపై చర్చలు చేపట్టాలన్నారు. మధ్యాహ్నం భోజనం, బుక్స్, దుస్తుల పంపిణీ, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాలలోని అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తు అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీలు వెంకట రమణ, అశోక్‌శ్రీనివాస్, ఉపాధ్యాయులు, మహిళా సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



ప్రదర్శనలిస్తున్న విద్యార్థులు

జగిత్యాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివ వీధిలో గల అల్ఫోర్స్ టెక్నో స్కూల్‌లో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలు అలరించాయి. అల్ఫోర్స్ పాఠశాలల అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రాథమిక విద్య చాలా విలువైనదని, భవిష్యత్తుకు పునాది ఇక్కడి నుంచే వస్తుందని తెలిపారు. చిన్నతనంలో గ్రహించే శక్తి చాలా ఉంటుందన్నారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో ప్రతీ సంవత్సరం యూకేజీ పూర్తి చేసిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు ప్రదానం చేసి సత్కరించి మూడో తరగతి ప్రవేశం కల్పిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవమి వేడుకలకు ముస్తాబైన ఆలయాలు

● బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన కోదండరామచంద్ర స్వామి ఆలయం
● ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు
● పట్టు వస్త్రాలు సమర్పించనున్న కలెక్టర్
● నేడు శ్రీరామ నవమి




కోదండ రామాలయం, మార్కండేయ స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

జగిత్యాల టౌన్, మార్చి 16: జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఆలయాలు శ్రీరామ నవమి వేడుకలకు ముస్తాబయ్యాయి. ధరూర్ క్యాంపులో ఉన్న కోదండ రామచంద్ర స్వామి ఆలయంలో 45వ బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 9 రోజులు పాటు ఆలయంలో వేడుకలు నిర్వహించేలా అన్ని చర్యలు చేపట్టారు. జగిత్యాలతో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో తరలి రానుండటంతో ఆలయ పరిసరాలను చలువ పందిళ్లతో ముస్తాబు చేశారు. అలాగే విద్యానగర్‌లోని సీతారామాంజనేయ స్వామి దేవాలయ ఆవరణను ముస్తాబు చేశారు. ప్రత్యేకంగా శ్రీ సీతారాముల కల్యాణం నిర్వహించేందుకు మండపం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చలువ పందిళ్లు వేశారు. మార్కండేయ ఆలయ ఆవరణలో శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణ వేడుకలను అంగడి బజార్‌లో నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆ ప్రాంతంలో శామియానాలు వేసి మండపాన్ని ముస్తాబు చేశారు. దీంతో పాటు అభయాంజనేయ స్వామి, హనుమాన్ వాడలోని హనుమాన్ దేవాలయం, వాణినగర్‌లోని రాజరాజేశ్వర స్వామి ఆలయం, పురాణిపేటలోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు.


తొమ్మిది రోజుల పాటు వేడుకలు..

కోదండరామచంద్రస్వామి ఆలయం 45వ బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. 17న బుధవారం రోజన పెద్ద ఎత్తున శ్రీ సీతరామచంద్రస్వామి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించనున్నారు. కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా స్వామివారలకు పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు. 18 గురువారం రోజున శ్రీరామ పట్టాభిషేక మహోత్సవంతో పాటు తిరు వీధి ఉత్సవమును ఘనంగా నిర్వహించనున్నారు. 19న స్వామి వారికి పవళింపు సేవ, 20న రోజున పుష్పాలంకరణ, దీపాలంకరణ చేపట్టనున్నారు. హనుమాన్ జయంతి పురస్కరించుకుని ఆలయంలో హనుమత్ అభిషేకం, సామూహిక హనుమాన్ ఛాలీసా పారాయణం చేపట్టనున్నారు. భక్తులకు ప్రతి రోజు తీర్థప్రసాదాలతో పాటు ముఖ్యమైన రోజుల్లో అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొంటున్నారు.

కల్యాణానికి ముస్తాబైన రామాలయం

కొడిమ్యాల: మండల కేంద్రంలోని పురాతన రామాలయం శ్రీరామ నవమిని వేడుకలకు ముస్తాబైంది. ఆలయాన్ని కొడిమ్యాల గ్రామ మాజీ సర్పంచు ఏలేటి మమతమమతనర్సింహరెడ్డి, గ్రామ ప్రముఖుల ఆధ్వర్యంలో రంగులను వేయించారు. ఆలయాల ముందు పందిళ్లను ఏర్పాటు చేశారు. స్వామి వారి కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రముఖులు తెలిపారు. కల్యాణ ఏర్పాట్లను మంగళవారం నల్లగొండ ఆలయ అధికారులు పరిశీలించారు.

సీఎం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరికలు



శ్రీనివాస రావుకు పార్టీ కండవా కప్పి ఆహ్వానిస్తున్న సీఎం

కోరుట్ల, ఏప్రిల్ 16 : కోరుట్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ రావు ఆధ్వర్యంలో నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ మహేష్ గౌడ్ సమక్షంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ జంగిలి వెంకట్ - సునిత, మెట్‌పల్లి మాజీ జడ్‌పీటీ సభ్యులు అకుల లింగారెడ్డి, నేరేళ్ల దేవేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ ముఖ్య నేతలు పార్టీ కండవా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గత అసెంబ్లీ ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి చెన్నమనేని శ్రీనివాస్ రావు పార్టీలో చేరగా అతనికి సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ కండవా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన డాక్టర్ జేఎన్ వెంకట్ - సునిత, ఆకుల లింగారెడ్డి, దేవేందర్‌లతో పాటు శ్రీనివాస్ రావులను సీఎం అభినందించి పార్టీలోకి ఆహ్వానించారు. పలు మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

కోరుట్ల/మెట్‌పల్లి: కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ జువ్వాడి నర్సింగరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరడానికి పలువురు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌కు తరలివెళ్లారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షీ నేతృత్వంలో పార్టీలో చేరడానికి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం, మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, జెట్టి లక్ష్మణ్, నర్సా గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

బెంచ్ అండ్ బార్ మధ్య సంబంధాలు కొనసాగాలి

మెట్‌పల్లి కోర్టు ఇన్‌చార్జి జడ్జి పావని

మెట్‌పల్లి, ఏప్రిల్, 16 : బెంచ్ అండ్ బార్ మధ్య సంబంధాలు మంచిగా కొనసాగడానికి న్యాయవాదులు ఉండాలని మెట్‌పల్లి కోర్టు ఇన్‌చార్జి జడ్జి పావని పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని కోర్టులో ఇన్‌చార్జి జడ్జిని న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి ఆధ్వర్యంలో న్యాయవాదులు శాలువలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలు ఉంటే నేరుగా దృష్టికి తీసుకరావాలని సూచించారు. కేసుల పరిష్కారానికి న్యాయవాదుల ఆ దిశగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల ఉపాధ్యక్షుడు అల్మాల రాంబాబు, ప్రధాన కార్యదర్శి తునికి వేణుగోపాల్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మాధవి, స్రవంతి, విజయలక్ష్మి, వెంకట్‌నర్సయ్య, శ్రీనివాస్, వెంకటస్వామి, మోహన్‌రెడ్డి, నర్సయ్య, అశోక్, భూషణ్, సుదర్శన్, జగన్, లక్ష్మారెడ్డి, భూమేశ్వర్, మహేష్, రాజారెడ్డి, శెట్టి లక్ష్మణ్, రాజేందర్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

'నిజామాబాద్ ఎంపీగా జీవన్ రెడ్డిని గెలిపించాలి'

జగిత్యాల టౌన్, మార్చి 16: నిజామాబాద్ ఎంపీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని 47, 48 వార్డుల్లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. జ్యోతి మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన ధ్యేయమన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు ఇద్దరూ తోడు దొంగలేనని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ఆరు గ్యారెంటీ పథకాలు అమలుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారన్నారు. జగిత్యాల ప్రాంత గళం ఢిల్లీకి వినబడాలంటే జీవన్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. టీపీసీసీ సభ్యుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి పాల్గొన్నారు.

రైతు సంక్షేమ పార్టీని గెలిపించుకోవడం బాధ్యత

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

మల్లాపూర్, ఏప్రిల్, 16 : రైతు సంక్షేమం కోసం పోరాటం చేసే పార్టీ బీఆర్ఎస్‌ను గెలిపించుకోవడం మన బాధ్యతని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మె ల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావులు పిలుపునిచ్చారు. మంగళవారం మల్లాపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా బీఆర్ ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌తో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సమావేశానికి వచ్చిన వారిని నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలుకుతూ పురవీధుల గుండా భారీ ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ నేతల మాటలు నమ్మి మళ్లీ మోసపోవద్దన్నారు. బీఆర్ఎస్ పాలనలో సాగు, తాగు, కరెంట్ సమస్యలు లేకుండా రైతు లకు అత్యధికంగా ప్రోత్సాహం కల్పించామన్నారు. కానీ కాంగ్రెస్ ఏర్పాడిన తరువాత ఏ ఒక్క సారి అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించకుండా రాజకీయాలు చేయడానికి ఇతరులను దూశించడం తప్ప పాలన పట్టించుకోవడం లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ గెలిపించు కోవడం మన అందరి బాధ్యత అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు తోట శ్రీనివాస్, ఎంపీపీ కాటిపెల్లి సరోజన-ఆదిరెడ్డి, జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, డీలర్ మల్లయ్య, గౌరు నగేష్ పాల్గొన్నారు.

శ్రీరామకృష్ణ సంకీర్తన మండలి వార్షికోత్సవాలు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 16 : మండలంలోని వేంపేట గ్రామంలోని శ్రీ రామకృష్ణ సంకీర్తన మండలి 55వ వార్షికోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఉత్సవాల్లో భాగంగా ఉదయం నుంచి స్వామి వారికి మందిరంలో ప్రత్యేక పూజలు, భగవద్గీత పారాయణం వంటి కార్యాక్రమాలను జరిపించారు. వార్షికోత్సవ కార్యాక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సత్యానంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీహరి తీర్థ స్వామి షష్టిపూర్తి పురస్కరించుకొని భక్తులు పుష్పాలతో అభిషేకాలు చేశారు. మండల సేవలో భాగంగా నిర్వాహకులు 22 మంది జంటలను సన్మానించారు. పీఠాధిపతి మాట్లాడుతూ ప్రతి ఇంట్లో శ్రీ సీతారామ చంద్రలు ఫొటోలను ఏర్పచుకోవాలని, శ్రీరాముడిలా ఇంటి పెద్దగా కుటుంబ సభ్యులకు యజమాని అండగా ఉండాలని పలు సూచించారు. శ్రీవీరజ నందతీర్థ స్వామి, మాత పరమేశ్వరి మండల వ్యవస్థాపక అధ్యక్షుడు గాజంగి బాలయ్య, డాక్టర్ గాజంగి రాజమల్లయ్య, రామకృష్ణ ఉన్నారు.

హమాలీలు లేక.. కొనుగోళ్లు సాగక..!

● కమ్ముకున్న మబ్బులతో కలవరం
● 20 రోజులుగా అన్నదాత నిరీక్షణ



కేంద్రాల్లో ఉన్న వరి ధాన్యం

కథలాపూర్, ఏప్రిల్ 16 : వరి కోతలు పూర్తి చేసుకుని కేంద్రాలకు తమ ధాన్యం తరలించిన రైతన్నకు కొనుగోళ్ల బెంగ పట్టుకుంది. ఓ వైపు ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడం తరచూ చినకులు రాలుతుండంతో అన్నదాత కలవర పడుతున్నాడు. వరి కోతలు దాదాపు పూర్తికావస్తున్నప్పటికీ కొనుగోళ్ళలో జరుగుతున్న జాప్యం కారణంగా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రాలు ప్రారంభించి 20 రోజులు గడుస్తున్నా హమాలీలు రాకపోవడం వల్ల రైతులు కల్లాల వద్ద రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది.

● హమాలీలను ఏర్పాటులో విపరీత కాలాయాపన

మండలంలో సెర్ప్ ఆధ్వర్యంలో 11 కేంద్రాలు, సిరికొండ విండో ఆధ్వర్యంలో 2, గంభీర్‌పూర్ సొసైటీ ఆధ్వర్యంలో 4, భూషణరావుపేట సొసైటీ ఆధ్వర్యంలో సుమారు 12 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు కేంద్రాలను ప్రారంభించారు.

అయితే ప్రతీ సీజన్‌లో బీహార్ నుంచి హమాలీలను తెప్పించి తూకం వేస్తుంటారు. కానీ ఈ సారి హమాలీలను తెప్పించడంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించారనే విమర్శలు వెల్లువె త్తుతున్నాయి. కేవలం భూషణరావుపేట సొసైటీలో మాత్రమే కొనుగోళ్లు జరుగు తుండగా మిగిలిన కేంద్రాల్లో రైతులు ఎదిరు చూపులు తప్పడం లేదు. అధికారులు చొరవ చూపి హమాలీలను తెప్పించి కొనుగోళ్లు జరపాలని రైతులు కోరుతున్నారు.

● వడ్లు ఎండిపోతున్నాయి

బన్నీ, రైతు భూషణరావుపేట



కేంద్రంకు ధాన్యం తెచ్చి 15 రోజులు గడిచింది. నిర్ణీత తేమ కూడా వచ్చింది. వడ్లు పూర్తిగా ఎండిపోతే నష్టం జరిగే అవకాశం ఉంది. అసలే నీళ్ల సరిపోక పంటలు ఎండిపోయాయి. కనీసం వచ్చిన పంటనైనా అమ్ముకుందామంటే హమాలీలను ఏర్పాటు చేయడం లేదు. వెంటనే హమాలీలను తెప్పించి కొనుగోళ్లు వేగవంతం చేయాలి.

● కేంద్రాల్లో ఇంకా తేమ రావడం లేదు

నరహరి, సెర్ప్ ఏపీఎం



సెర్ప్ ఆధ్వర్యంలో 11 కేంద్రాలు ఏర్పాటు చేస్తుండా ఐదు కేంద్రాలకు హమాలీలు వచ్చారు, అయితే నిర్ణీత తేమ రాకపోవడం వల్ల కొనుగోళ్లు జరపడం లేదు. మిగిలిన కేంద్రాలకు బీహార్ నుంచి హమాలీలను తెప్పించే ఏర్పాట్లు చేస్తున్నాం. మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొనుగోళ్లు వేగవంతం చేస్తాం. ఈ సీజన్‌లో లక్ష క్వింటాళ్ల ధాన్యం వస్తుందని అనుకుంటున్నాం.

శ్రీరామనవమి ఉత్సవాలకు మాజీ మంత్రి కొప్పులకు ఆహ్వానం

పెగడపల్లి, ఏప్రిల్ 16 : పెగడపల్లి మండలంలోని నామాపూర్ గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో బుదవారం జరుగనున్న శ్రీరామనవమి వేడుకలకు రావాలని కోరుతూ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు మంగళవారం ఆలయకమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇనుగండ్ల కరుణాకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కొమురెల్లి ఆనందం తదితరులు ఉన్నారు.

బ్యాంక్ లింకేజీ లక్ష్యం నెరవేర్చాలి

కథలాపూర్, ఏప్రిల్ 16 : 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్ధయించుకున్న బ్యాంక్ లింకేజీ, స్త్రీ నిధి రుణాల లక్ష్యం నెరవేర్చాలని సెర్ప్ ఏపీఎం నరహరి కోరారు. మంగళవారం సెర్ప్ కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని రకాల వసతులు కల్పించడంతో పాటు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో కొనుగోళ్ళ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. గ్రామ సంఘాల సమావేశాల ఏర్పాటు, పుస్తకాల నిర్వాహణను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు యూనిఫాం కుట్టించే మహిళల వివరాలు సేకరించి కొలతలు తీసుకునే ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా సీసీలు తెడ్డు అంజయ్య, విజయలక్ష్మీ, అశోక్, మండల సమాఖ్య అధ్యక్షులు పాల్గొన్నారు.

'అమ్మ' కమిటీలతో పాఠశాలల అభివృద్ధి

కథలాపూర్, ఏప్రిల్ 16 : ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేయనున్న అమ్మ ఆదర్శ కమిటీలతో పాఠశాలలను అభివృద్ధి చేసుకోవాలని ఎంఈవో ఆనందరావు సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామైఖ్య సంఘాల అధ్యక్షులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో కలిసి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. తరగతికి ముగ్గురు చొప్పున విద్యార్థుల తల్లులు కమిటీలో సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు. గ్రామైఖ్య సంఘ అధ్యక్షురాలు, హెడ్ మాస్టర్‌తో కలిపి ప్రత్యేక అకౌంట్ పాఠశాల పేరిట తెరిచి ప్రభుత్వ నిధులతో ఖాతా నిర్వహించాల్సి ఉంటుందన్నారు. వీఓ అధ్యక్షురాలు చైర్మన్‌గా, హెచ్ఎం కన్వీనర్‌గా వ్యవహరిస్తూ పాఠశాలలను అభివృద్ధి చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, ఎంపీవో ప్రవీణ్, ఏపీఎం నరహరి, ఏఈ ఆదిత్య, వివిధ ఉన్నారు.

తాటి, ఈత వనం దగ్ధం

మల్యాల, ఏప్రిల్ 16: దిగువ కొండగట్టులో నిప్పంటుకొని తాటి, ఈత వనం దగ్ధం అయింది. కాటమయ్య ప్రాంతంలో మంగళవారం తాటి, ఈత చెట్లకు ప్రమాదవశత్తు నిప్పంటుకోగా గౌడ సంఘం ప్రతినిధులు జగిత్యాలలోని ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను ఆర్పివేసింది. ఈ ప్రమాదంలో సుమారు 500 వరకు చెట్లు దహనం అయినట్లు గీత కార్మికులు తెలిపారు.

వ్యాధులపై అవగాహన కల్పించాలి

మల్లాపూర్, ఏప్రిల్, 16 : లెప్రసీ, క్యాన్సర్ వ్యాధులపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం మల్లాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పలువురికి పరీక్షలు చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధులు సోకిన ప్పుడు గుర్తించిన వెంటనే వైద్యులను సంప్రదించి సూచనలు పాటించాలన్నారు. వ్యాధులు సోకిందని దిగులు పడుతే ఆరోగ్యం మరింత క్షినిస్తుందని ధైర్యంగా వైద్యుల సూచనలు పాటించి మెరుగు పరుచుకోవచ్చని పలు సూచనలు చేశారు. వైద్యులు వాహినిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి జాతరలో ఎమ్మెల్యే పూజలు

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 16 : మండలంలోని పైడిమడుగులో మంగళవారం నిర్వహించిన మల్లికార్జునస్వామి ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమంలో కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఆలయ పండితులు ఘన స్వాగతం పలికగా స్థానికులు శాలువాలతో ఎమ్మెల్యేను సన్మానించారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

రాయికల్, ఏప్రిల్ 16: మండలంలోని ఉప్పుమడుగు, ఆలూరు గ్రామాల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ డాక్టర్ రాంబాబు మంగళవారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో జరుగు తున్న కొనుగోళ్లను పరిశీలించి, రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం మైతాపూర్ గ్రామంలోని రైస్‌మిల్లును ఆయన తనిఖీ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ ఖయ్యూం ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి

గొల్లపల్లి, ఏప్రిల్ 16 : యాసంగి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైన దృష్ట్యా ధాన్యం విక్రయానికి వచ్చే రైతులకు కేంద్రాల్లో అన్ని రకాల మౌళిక వసతులను ఏర్పాటు చేయాలని డీఆర్‌డీఏ పీడీ సంపత్ రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం గొల్లపల్లి మండలం వెంగళాపూర్, శంకర్రావు పేట గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీడీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో రైతులు విక్రయానికి పోసిన వరి ధాన్యం రాశులను మ్యాచర్ వేయించి తనిఖీ చేశారు.